క్లుప్తంగా

ఆదివాసీ సమస్యలపై నిరంతర పోరాటం



మాట్లాడుతున్న కోవ విజయ్

కెరమెరి: ఆదివాసీ సమస్యలపై నిరంతరం పోరాటం సాగిస్తామని తుడుందెబ్బ జిల్లా ఉపాధ్యక్షుడు కోవ విజయ్ అన్నారు. మండల కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 20న నిర్వహించే ఐటీడీఏ ముట్టడి కార్యక్రమంలో ఆదివాసీలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఎస్టీ జాబితాలో 11 కులాలను కలుపుతామని సీఎం చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. పెసా, 1/59, 1/70 చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని, ఐదో షెడ్యూల్ ప్రాంతాన్ని పరిరక్షించాలని, జీవో నం.3 పునరుద్ధరించాలని, చట్టబద్ధత లేని లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. కుడ్మెత సోము, సెడ్మకి తుకారాం, భీంరావు, మెస్రం శేఖర్ ఉన్నారు.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే లక్ష్యం



భూమిపూజ చేస్తున్న ప్రజాప్రతినిధులు

కౌటాల: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఎంపీపీ బసర్కార్ విశ్వనాథ్ అన్నారు. మండలంలోని ముత్తంపేట్ గ్రామంలో రూ.15 లక్షల నిధులతో సీసీ రోడ్డు నిర్మాణానికి గురువారం ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలకు మెరుగైన రవాణా వ్యవస్థ కల్పించడానికి సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆదే శ్రీనివాస్, పార్టీ మండల అధ్యక్షుడు ఆదే వసంత్‌రావ్, నాయకులు మధుకర్, రమేశ్, విజయ్, దోని రవి, అంజయ్య, శంకర్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తోటి విద్యార్థినికి చేయూత



ఆర్థికసాయం అందిస్తున్న ఎంపీపీ, ఆర్‌సీ

రెబ్బెన: కష్టాల్లో ఉన్న తోటి విద్యార్థినికి చేయూతనిచ్చిన తోటి విద్యార్థులను ఎంపీపీ సౌందర్య, గురుకుల విద్యాలయ ఆదిలాబాద్ ఆర్‌సీ స్వరూపరాణి అభినందించారు. మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థిని నవనీత గుండెలో రంధ్రం సమస్యతో బాధపడుతోంది. ఈ మేరకు శస్త్ర చికిత్స చేయించుకోగా విజయవంతమైంది. బాధిత విద్యార్థినికి తోటి విద్యార్థులంతా చేయి చేయి కలిపి రూ.1,01,500లను పోగు చేశారు. వీటిని గురువారం ఎంపీపీ, ఆర్‌సీ బాధిత తల్లికి అందజేశారు. ప్రిన్సిపాల్ జ్యోతి, సర్పంచ్ అహల్యాదేవి, పేరెంట్స్ కమిటీ సభ్యులు బాబురావు పాల్గొన్నారు.

పాఠశాల వార్షికోత్సవం



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాకేంద్రంలోని సరస్వతి శిశుమందిర్ పాఠశాల వార్షికోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన డీఈవో అశోక్, జెడ్పీటీసీ నాగేశ్వర్‌రావు మాట్లాడారు. విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. సమాజంలో ప్రవర్తించాల్సిన తీరు పాఠశాలలో నేర్పుతారని, దీనికి శిశుమందిరాలు ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శిన నృత్యాలు, పాటలు అందరిని ఆకట్టుకున్నాయి. పాఠశాల కమిటీ జిల్లా అధ్యక్షుడు అనిత, అధ్యక్షుడు వెంకన్న, హెచ్ఎం కోటేశ్వరరావు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పనులు శరవేగంగా పూర్తిచేయాలి

కౌటాల: మన ఊరు–మన బడిలో భాగంగా పనులు శరవేగంగా పూర్తిచేయాలని ఎంపీపీ విశ్వనాథ్ అన్నారు. గురువారం కౌటాల ప్రాథమిక పాఠశాలలో చేపడుతున్న మన ఊరు–మన బడి కార్యక్రమం ద్వారా చేపడుతున్న పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించి సకాలంలో పూర్తిచేయాలన్నారు. తహసీల్దార్ మునావర్ షరీఫ్, ఎంపీడీవో నస్రుల్లాఖాన్, ఎంఈవో సోమయ్య, సర్పంచ్ వొజ్జల మౌనిశ్, ఉప సర్పంచ్ తిరుపతి, కార్యదర్శులు సాయికృష్ణ, భాస్కర్, ఉపాధ్యాయులు ఉన్నారు.

బ్రహ్మోత్సవాలకు ముస్తాబు



వేంకటేశ్వరస్వామి ఆలయం



గర్భగుడిలోని ప్రతిమలు

- 18 నుంచి శ్రీ వేంకటేశ్వరస్వామి తిరునాళ్లు
- స్వామివారి పల్లకి ఊరేగింపు
- వారం రోజులు ఉత్సవాలు

కెరమెరి: బ్రహ్మోత్సవాలకు వెంకన్న ముస్తాబవుతున్నాడు. ఆలయానికి అర్ధ శతాబ్దానికి పైగా కావడంతో ఉత్సవాలు ఘనంగా జరగనున్నాయి. మండల కేంద్రంలోని నెహ్రూనగర్‌లో శనివారం నుంచి వైభవంగా భక్తిశ్రద్ధలతో శ్రీ వేంకటేశ్వరస్వామి తిరునాళ్లు కొనసాగనుంది. ఈసారి వినూత్నంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ సభ్యులు సన్నాహాలు చేశారు. స్వామివారిని ప్రతిష్ఠించి సుమారు 53 ఏళ్లు కావస్తుంది. వేంకటేశ్వరస్వామి ఆలయానికి ఆనుకునే అలివేలు మంగ ఆలయం ఉంది. ఈ నేపథ్యంలో గడిచిన 45 ఏళ్లు 'వెంకన్న' పేరిట జాతర నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ప్రతిఏటా శివరాత్రి పర్వదినం పురస్కరించుకుని ఈ ఉత్సవాలను ప్రారంభిస్తారు. అయితే గత రెండేళ్లుగా కరోనా నేపథ్యంలో జాతర సవ్యంగా కొనసాగలేదు. ఈసారి ఆ ప్రభావం లేకపోవడంతో ఘనంగా నిర్వహించనున్నారు.

సాక్షాత్తు తిరుపతి తిరుమల నుంచి ఆ ఏడుకొండల వాడు దిగిరానున్నాడు. వారం రోజుల పాటు కెరమెరిలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు కొనసాగనున్నాయి. ఈ మేరకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మహాశివరాత్రి పురస్కరించుకుని ఈనెల 18 నుంచి గోవిందుడి ఉత్సవాలు కనుల పండువగా జరగనున్నాయి. వారం రోజుల పాటు కొనసాగనున్నాయి.

నేపథ్యం ఇది..

1970లో నెహ్రూనగర్‌కి చెందిన తిమ్మయ్య పూజారికి ఏడుకొండలవాడు ప్రత్యక్షమయ్యాడు. ఆ వృద్ధుడికి రాత్రి కలలో శ్రీవారు దర్శనమిచ్చారు. తాను ఫలానా ప్రాంతంలో ఉన్నానని వెంటనే అక్కడ తవ్వితే విగ్రహం లభిస్తుంది. దాన్ని ప్రతిష్ఠించి పూజలు జరిపితే ఆయురారోగ్యాలతోపాటు సకల కార్యాలు సిద్ధిస్తాయని, గ్రామంలో సుఖఃశాంతులు కలుగుతాయని చెప్పారు. ఇదే విషయాన్ని గ్రామ పెద్దలతో చెప్పి కలలో తెలిపిన ప్రాంతంలో తవ్విచూడగా విగ్రహం లభించింది. దాంతో అదే చోట ఆలయం నిర్మించారు. నాటి నుంచి 12 ఏళ్ల క్రితం వరకు తిమ్మయ్య భక్తులకు సేవలందించారు. ఎవరికీ ఏ ఆపద, దుఃఖం వచ్చిన ఆయన వద్దకు వెళ్లి తమ బాధలు చెప్పుకునేవారు. భూత, భవిష్యత్తులో జరిగే విషయాలను సైతం తిమ్మయ్య భక్తులకు వివరించేవాడు. అనంతరం 2003లో వృద్ధాప్యంతో స్వర్గస్తులయ్యారు. ప్రస్తుతం ఆయన తనయుడు లక్ష్మణ్ పూజారి పూజలు నిర్వహస్తున్నారు.

వివిధ ప్రాంతాల నుంచి భక్తుల రాక..

శివరాత్రి పురస్కరించుకుని ఉమ్మడి జిల్లా నుంచే కాక కర్ణాటక, మహారాష్ట్ర, బెంగుళూరు, వరంగల్, కరీంనగర్ తదితర జిల్లాలకు చెందిన భక్తులు ఇక్కడకు తరలివస్తారు. 18 ఉదయం 11 గంటలకు స్వామివారి అఖండ దీపారాధన, పల్లకి ఊరేగింపు, మధ్యాహ్నం 2 గంటలకు మహాపూజ ఉంటుంది. ఈ నేపథ్యంలో వివిధ ఆటల పోటీలు నిర్వహించేందుకు నిర్వాహకులు సన్నాహాలు చేశారు.

సేవాలాల్ చూపిన మార్గంలో నడవాలి

- జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి



దర్శించుకుంటున్న జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి

రెబ్బెన(ఆసిఫాబాద్): ప్రతిఒక్కరూ సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ చూపిన మార్గంలో నడవాలని జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి అన్నారు. మండలంలోని కైరిగూడలో జగదాంబదేవి, సంత్ శ్రీ రామారావు మహారాజ్, సద్గురు ప్రేంసింగ్ మహారాజ్‌ల విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలను గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై జగదాంబదేవిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. సేవాలాల్ చూపిన సన్మార్గంలో బంజారాలు నడుచుకోవాలన్నారు. అత్యంత నియమనిష్టలతో చేపట్టే సేవాలాల్ దీక్షలతో లంబాడాలతో ఎంతో మార్పు వచ్చిందన్నారు. ఎంపీపీ సౌందర్య, మాజీ జెడ్పీటీసీ బాబురావు, కులపెద్దలు బలరాం నాయక్, దుప్పా నాయక్, బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఆత్మారాం నాయక్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పోటు శ్రీధర్‌రెడ్డి, నాయకులు రవినాయక్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల వేతనాలు పెంచాలి



పాదయాత్ర పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

రెబ్బెన: జీవో 60 ప్రకారం గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న కార్మికుల వేతనాలు పెంచాలని పంచాయతీ కార్మికుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ అన్నారు. ఈనెల 20న నిర్వహించే పాదయాత్ర పోస్టర్‌ను గురువారం రెబ్బెన పంచాయతీ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల తరహాలో పంచాయతీ కార్మికులకు జీవో 60 ప్రకారం వేతనాలు పెంచాలన్నారు. ప్రమాదబీమా, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని పాలకుర్తి నుంచి హైదరాబాద్ వరకు కార్మికుల పాదయాత్ర మొదలైందన్నారు. దీనికి సంఘీభావంగా ఈనెల 20న జిల్లాకేంద్రంలోని అంజనేయస్వామి విగ్రహం నుంచి కలెక్టరేట్ వరకు పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పాదయాత్ర 17 రోజుల పాటు 300 కి.మీ మేర నాలుగు జిల్లాల పరిధిలో కొనసాగి ఈనెల 28న ఇందిరాపార్కుకు చేరుతుందన్నారు. కార్యక్రమంలో దుర్గాప్రసాద్, శంకర్, నర్సయ్య, శేఖర్, ప్రవీణ్, సునీల్, దేవాజీ, రమేశ్, రాజమ్మ, రాజేశ్వరి, అమృత పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు



ఆసిఫాబాద్‌రూరల్: అవగాహన కల్పిస్తున్న అధికారులు



కాగజ్‌నగర్‌రూరల్: మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయశాఖ అధికారి శ్రీనివాస్‌రావు

ఆసిఫాబాద్‌రూరల్: ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు గడించవచ్చునని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి వెంకటేశం, ఏవో ఖాదర్ హుస్సేన్ అన్నారు. మండలంలోని బూర్గుడ, పర్శనంబాల, ఇదులవాడ, బాబాపూర్‌తోపాటు పలు గ్రామాల్లో ఆయిల్‌పాం సాగు విధానంపై రైతులకు గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశ జనాభాకు సరిపడే వంట నూనె స్వదేశంలో ఉత్పత్తి కావడంతో ఎక్కువ డిమాండ్ ఉందన్నారు. మన ప్రాంతంలో అయిల్‌పాం సాగు చేస్తే మంచి ధరతోపాటు రైతులకు అధిక లాభం వస్తుందన్నారు. అయిల్ పాం మొక్క ఖరీదు రూ.193 కాగా రాయితీపై కేవలం రూ.20లకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందన్నారు. ఏఈవోలు రాము, చిరంజీవి, ఖలీల్, సర్పంచులు, రైతులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్‌రూరల్: ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు సాధించవచ్చని జిల్లా వ్యవసాయశాఖ అధికారి శ్రీనివాస్ రావు అన్నారు. మండలంలోని దుర్గానగర్ రైతు వేదికలో రైతులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ రైతులకు వందశాతం, బీసీలకు 90 శాతం, ఇతరులకు 80 శాతం సబ్సిడీతో బిందు సేద్య పరికరాలు అందజేయనున్నట్లు తెలిపారు. ఆయిల్‌పాం గెలలు అమ్మడానికి ఎలాంటి ఇబ్బందిలేదని, మ్యాట్రిక్స్ కంపెనీ వారు నేరుగా రైతుల వద్దకు వచ్చి కొనుగోలు చేస్తారన్నారు. పెంచికల్‌పేట ఏడీఏ రాజుల నాయుడు, కాగజ్‌నగర్ ఏఓ రామకృష్ణ, ఏఈవో శైలేష్, సర్పంచులు పాల్గొన్నారు.

కౌటాల: రైతులు ఆయిల్‌పాం సాగు చేయాలని ఎంఈవో చౌదరి అంజన్న అన్నారు. మండలంలోని గుండాయిపేట్ రైతు వేదికలో రైతులకు ఆయిల్‌పాం మొక్కల సాగు పై అవగాహన కల్పిస్తున్నారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

దహెగాం: మండల కేంద్రంతోపాటు హత్తిని, బీబ్రా గ్రామంలోని రైతులకు వ్యవసాయాధికారులు ఆయిల్‌పాం సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏవో వంశీకృష్ణ మాట్లాడుతూ ఆయిల్‌పాం మొక్కలపై ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తోందన్నారు. ఒక మొక్క ధర రూ.193 ఉండగా 173 సబ్సిడీ ఇస్తోందని, రైతు రూ.20 చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఎకరంలో 57 మొక్కలు నాటుకోవచ్చని అన్నారు. హత్తిని గ్రామంలో సాగు చేస్తున్న ఆయిల్ పాంను పరిశీలించారు. బీబ్రా సర్పంచ్ బండక్రిష్ణమూర్తి, ఏఈవోలు శోభన్, వెన్నెల, రైతులు పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్: మండలంలోని చేడ్వాయి, కమ్మర్‌గాం రైతువేదికల్లో ఏఈవోలు గౌసియాబేగం, శ్రీవిద్యలు గురువారం ఆయిల్‌పాం సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆయిల్‌పాం సాగు చేస్తున్న రైతులకు ప్రభుత్వం 90 శాతం సబ్సిడీపై డ్రిప్ అందిస్తోందన్నారు. ఎకరాకు రూ.4200 ఎరువులకు అందిస్తోందని పేర్కొన్నారు. సర్పంచ్ పొర్తెటి మధునయ్య, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఐకేపీ వీవోఏల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

ఆసిఫాబాద్అర్బన్: మండలంలోని ఐకేపీ వీవోఏల సమస్యలు పరిష్కరించాలని, అదేవిధంగా వారిని ఇబ్బందులకు గురిచేస్తున్న సీసీలను వెంటనే సస్పెండ్ చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు అల్లూరి లోకేశ్ డిమాండ్ చేశారు. జిల్లాకేంద్రంలోని ఐకేపీ మండల కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వీవోఏల సమస్యలు పరిష్కరించడానికి డీఆర్డీఏ పీడీ స్పందిస్తూ త్రిసభ్య కమిటీని నియమించడాన్ని వీవోఏ యూనియన్ స్వాగతిస్తుందని అన్నారు. వీవోఏలపై పనిభారంతో అదనపు పనులు చేయించడాన్ని వ్యతిరేకిస్తున్నామని అన్నారు. సెర్ప్ ద్వారానే వారికి సెల్‌ఫోన్ ఇచ్చి, సరైన డాటా ఇచ్చి ఆన్‌లైన్ పనులు చేయించాలని డిమాండ్ చేశారు. కొంత మంది సీసీలు గ్రేడింగ్ పేరుతో డీ గ్రేడ్ ఇస్తూ వారి వేతనాలను సకాలంలో చెల్లించడం లేదన్నారు. వారిని ఇబ్బందులకు గురిచేస్తున్న సీసీలను విధుల నుంచి తొలగించాలన్నారు. లేకపోతే సీఐటీయూ ఆధ్వర్యంలో డీఆర్డీఏ పీడీ కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్షలు చేపడుతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో నాయకులు చందేకర్ జ్యోతి, సునీత, కల్పన, వినోద్, ఫైమా, బుద్దు, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

పంటల వివరాలు నమోదు చేయాలి



లోడుపల్లిలో క్రాప్ సర్వేను పరిశీలిస్తున్న డీఏవో శ్రీనివాసరావు

పెంచికల్‌పేట్: రైతులు సాగు చేస్తున్న పంటల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని లోడుపల్లిలో నిర్వహిస్తున్న క్రాప్ సర్వేను గురువారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులు పంటల దిగుబడిని అంచనా వేయడంతోపాటు మార్కెటింగ్ వసతులు కల్పించేందుకు పంటల నమోదు ఉపయోగపడుతుందన్నారు. ఏఈవోలు నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ రైతుల సందేహాలను తీర్చాలన్నారు. లోడుపల్లిలో సాగు చేసిన కంది, వరి పంటలను పరిశీలించారు. ఆయన వెంట పెంచికల్‌పేట్ ఇన్‌చార్జి ఏడీఏ రాజులనాయుడు, ఏఈవో లావణ్య, రైతులు ఉన్నారు.

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి

ఆసిఫాబాద్అర్బన్: జిల్లాలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కలెక్టర్ హేమంత్ బోర్కడేకి తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) నాయకులు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మహేశ్ మాట్లాడుతూ అర్హులైన జర్నలిస్టులందరికీ ప్రభుత్వం ఇళ్లు, ఇళ్ల స్థలాలు కేటాయించాలన్నారు. వర్కింగ్ జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ కార్డులు మంజూరు చేయాలని, వెంటనే రెండోవిడత కార్డుల పంపిణీ ప్రక్రియ ప్రారంభించాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, జాతీయ కౌన్సిల్ సభ్యుడు సురేందర్‌రావు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు సతీశ్, కోశాధికారి కృష్ణ మోహన్ గౌడ్, నాయకులు రవి, జలీల్ బేగ్ ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

కలెక్టర్‌ను కలిసిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు

ఆసిఫాబాద్: ఇటీవల నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్ బొర్కడే హేమంత్ సహదేవ్‌రావును గురువారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ కలెక్టరేట్ చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. నాయకులు శ్రీశైలం, అంజనేయులు గౌడ్, ఖాండ్రే విశాల్, గణేశ్, రాధిక ఉన్నారు.

ముగిసిన కంటి వెలుగు శిబిరం

చింతలమానెపల్లి: బాబాపూర్ రవీంద్రనగర్ పీహెచ్‌సీ పరిధిలోని బూరెపెల్లిలో నిర్వహిస్తున్న కంటివెలుగు శిబిరం గురువారంతో ముగిసింది. ఈ శిబిరంలో ఐదురోజుల పాటు గ్రామస్తులకు కంటి పరీక్షలు నిర్వహించినట్లు వైద్యాధికారి రాజ్‌కుమార్ తెలిపారు. గంగాపూర్‌లో శుక్రవారం నిర్వహించే శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

డిగ్రీ పరీక్షల తేదీల్లో మార్పులు

కాగజ్‌నగర్‌టౌన్: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ద్వారా ఈనెల 26న నిర్వహించాల్సిన డిగ్రీ సెమిస్టర్–3 పరీక్షల తేదీల్లో మార్పు చేసినట్లు ఎస్‌కేఈ డిగ్రీ కళాశాల కోఆర్డినేటర్ తుదురు దత్తాత్రేయ ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 26న నిర్వహించనున్న డిగ్రీ సెమిస్టర్–3 పరీక్షను యూనివర్సిటీ వాయిదా వేసిందని, ఈ తేదీకి బదులుగా ఈనెల 27న పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. 27న నిర్వహించాల్సిన డిగ్రీ తృతీయ సంవత్సరం సెమిస్టర్–5 పరీక్షలు మార్చి 18 నుంచి ఉంటుందని వివరించారు. వివరాలకు 9866398678 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

పారిశుధ్యం, పరిశుభ్రతపై అవగాహన

వాంకిడి: ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని నూతనంగా నిర్మిస్తున్న సఖీ కేంద్రంలో గురువారం కేర్ ఇండియా ఆధ్వర్యంలో అంగన్‌వాడీలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తాగునీరు కలుషితం కాకుండా తీసుకోవల్సిన జాగ్రత్తలు, పారిశుధ్యం, పరిసరాల శుభ్రత తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కేర్ ఇండియా రీసోర్స్ పర్సన్ శివయ్య, ఫీల్డ్ కోఆర్డినేటర్ బాలకృష్ణ, సీఆర్పీ పితాంబర్ తదితరులు పాల్గొన్నారు.

కొండపల్లిలో శివుడి విగ్రహప్రతిష్ఠాపన

పెంచికల్‌పేట్: కొండపల్లి పంచాయతీ పరిధిలోని గొల్లవాడలో నూతనంగా నిర్మించిన మల్లన్న ఆలయంలో గురువారం శివుడి విగ్రహాన్ని పండితుల వేదమంత్రోచ్ఛరణాల మధ్య ప్రతిష్ఠాపన వైభవంగా నిర్వహించారు. ఆలయంలో ప్రతిష్ఠించిన శివుడు, నంది విగ్రహాలను బాజభజంత్రీలతో గ్రామవీధుల గుండా ఊరేగింపు చేపట్టారు. జెడ్పీ వైస్‌చైర్మన్ కోనేరు కృష్ణారావు, ఆసిఫాబాద్ జెడ్పీటీసీ నాగేశ్వర్‌రావు, సర్పంచులు సంజీవ్, శ్రీనివాస్ పూజలు చేశారు.

సఖీ సేవలపై అవగాహన

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని అంకుసాపూర్, ఎన్జీవోస్ కాలనీ గ్రామాల్లో సఖీ సేవలపై గురువారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. నిర్వాహకులు మమత, మౌనిక పాల్గొన్నారు.

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలి

కౌటాల: విద్యార్థులకు అర్థమయ్యేలా సులభపద్ధతిలో విద్యాబోధన అందించాలని ఎఫ్ఎల్ఎన్ మండల నోడల్ అధికారి గావుడే హన్మంతు అన్నారు. మండలంలోని వీరవెల్లి, సాండ్గాం, పార్డీ, కౌఠి గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలలను గురువారం ఆయన తనిఖీ చేశారు. సీఆర్పీ ప్రకాశ్ ఉన్నారు.

డైరీ ఆవిష్కరణ

ఆసిఫాబాద్: జిల్లాకేంద్రంలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో గురువారం మాస్‌మీడియా అండ్ హెల్త్ ఎడ్యుకేటర్స్ డైరీని డీఎంహెచ్‌వో డాక్టర్ ప్రభాకర్ రెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో కొత్తగా బాధ్యతలు స్వీకరించిన డీఎంహెచ్‌వో డాక్టర్ రామకృష్ణ, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సుధాకర్ నాయక్, వైద్యురాలు డాక్టర్ రవళి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అభ్యాసన సామర్థ్యాల పెంపునకు అక్షరజ్యోతి

కెరమెరి: విద్యార్థుల్లో అభ్యాసన సామర్థ్యాల సాధన కోసం అక్షరజ్యోతి కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారని మండల ప్రత్యేకాధికారి ఆడే ప్రకాశ్ తెలిపారు. వారి జీవితాల్లో వెలుగు నింపాలని, పూర్తిస్థాయిలో వినియోగించుకుని సామర్థ్యాలు పెంపొందించుకోవాలన్నారు. మండలంలోని శంకర్‌గూడలో కొనసాగుతున్న గిరిజన ప్రాథమిక పాఠశాలను గురువారం సందర్శించారు. చిన్నారులతో చదివించారు. పూర్తిస్థాయిలో ఆంగ్ల బోధనలతో విద్యార్థులు పట్టు సాధిస్తున్నారని అన్నారు. అనంతరం కరంజివాడ, జన్కాపూర్ పాఠశాలల్లో కొనసాగుతున్న మన ఊరు–మన బడి పనులను పరిశీలించారు.

రేషన్ దుకాణం ప్రారంభం

ఆసిఫాబాద్‌రూరల్: ఇదులవాడ పంచాయతీలో రేషన్ దుకాణాన్ని జెడ్పీటీసీ నాగేశ్వర్‌రావు, ఎంపీపీ మల్లికార్జున్ ప్రారంభించారు. సర్పంచ్ భీమేష్, నాయకులు గోపాల్ నాయక్, నిసార్ ఉన్నారు.

పశువుల యజమానులపై చర్యలు తీసుకోవాలి

చింతలమానెపల్లి: రోడ్లపై పశువులను వదిలిస్తే యజమానులపై చర్యలు తీసుకోవాలని డబ్బా, బారెగూడ గ్రామస్తులు కోరారు. ఈ మేరకు పంచాయతీ కార్యదర్శి సురేశ్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. వార్డు సభ్యులు జమ్నాజీ, ఆనంద్‌రావు, గ్రామపెద్దలు ఎర్రయ్య, శంకర్ పాల్గొన్నారు.

రుణాలను సకాలంలో చెల్లించాలి

కెరమెరి: బ్యాంక్‌ల రుణాలను సకాలంలో తిరిగి చెల్లించాలని తెలంగాణ గ్రామీణ బ్యాంకు అధికారి భూమన్న అన్నారు. మండలంలోని మెట్టపిప్రి గ్రామంలో గురువారం ఏర్పాటు చేసిన ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడారు. రైతులు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లిస్తే పావులా వడ్డీ వర్తిస్తుందని పేర్కొన్నారు.

ఉపాధి పనులు సద్వినియోగం చేసుకోవాలి

వాంకిడి: జాబ్‌కార్డులు ఉన్న కూలీలు ఉపాధిహామీ పనులు సద్వినియోగం చేసుకోవాలని ఏపీడీ కుటుంబరావు కోరారు. ఖమాన, ఇందాని గ్రామాల్లో ఉపాధి పనులపై అవగాహన కల్పించారు. ఆర్థిక సంవత్సరం ముగియనున్నందున వందరోజుల ఉపాధి పూర్తి చేసుకోని వారు పనులకు వెళ్లాలని సూచించారు. ఎంపీడీవో వెంకటేశ్వర్‌రెడ్డి, ఎపివో శ్రావణ్‌కుమార్ ఉన్నారు.

మోడల్ స్కూల్ ప్రవేశ గడువు పెంపు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాకేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో 6 నుంచి 10వ తరగతిలో ప్రవేశాల కోసం దరఖాస్తు గడువు ఈనెల 15 నుంచి ఈనెల 22వ తేదీ వరకు పెంచినట్లు ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్ ఓ ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకునే విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇప్పటివరకు అన్ని తరగతులకు గాను 1097 మంది దరఖాస్తులు చేసుకున్నట్లు తెలిపారు.

ఫొటోగ్రాఫర్‌కు ఆర్థికసాయం

కాగజ్‌నగర్‌టౌన్: ప్రమాదంలో గాయపడిన కాగజ్‌నగర్‌లోని నవగాం బస్తీకి చెందిన రాకేశ్ అనే ఫొటోగ్రాఫర్‌కు ఫొటోగ్రాఫర్స్ అండ్ వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ సభ్యులు అండగా నిలిచారు. గురువారం బాధితుడికి రూ.21 వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ ఫొటోగ్రాఫర్ విధులు ముగించుకుని కాగజ్‌నగర్‌కు వెళ్తుండగా ఎక్స్‌రోడ్ వద్ద బైక్ అదుపుతప్పి తీవ్రగాయాలైనట్లు తెలిపారు. వైద్యఖర్చుల నిమిత్తం అసోసియేషన్ సభ్యులు తమవంతుగా వీటిని అందించినట్లు పేర్కొన్నారు. కాగజ్‌నగర్ ఫొటో, వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ముసలమ్మగుట్టపై జాతరకు ఏర్పాట్లు



ముసలమ్మ గుట్టపై ఏర్పాట్లు చేస్తున్న యువకులు

చింతలమానెపల్లి: మండలంలోని ఖర్జెల్లి అటవీప్రాంతంలోని ముసలమ్మగుట్ట శివాలయంలో మహాశివరాత్రి జాతరకు ఏర్పాట్లు నిర్వహిస్తున్నారు. గురువారం గ్రామ యువకులు ఆలయ పరిసరాలు శుభ్రం చేసి భక్తుల కోసం పలు ఏర్పాట్లు చేపట్టారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 18న భాగవతం, 19న మహారాష్ట్ర బృందం సభ్యులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడుతున్నామని ఆలయ కమిటీ అధ్యక్షుడు చౌదరి నారాయణ తెలిపారు.

జాతర ఏర్పాట్ల పరిశీలన

వాంకిడి: మహాశివరాత్రిని పురస్కరించుకుని మండల కేంద్రంలోని శివాలయం వద్ద చిక్లీ వాగు ప్రాంతంలో నిర్వహించే జాతర ఏర్పాట్లను సీఐ శ్రీనివాస్, ఎస్సై సాగర్ గురువారం పరిశీలించారు. వాహనాల పార్కింగ్ ఏరియా, దుకాణాల ఏర్పాట్ల పరిశీలించి సూచనలు చేశారు. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

మహాశివరాత్రి జాతర ఉత్సవాలు ప్రారంభం

కౌటాల: మండలంలోని తాటిపల్లి సమీపంలోని శ్రీ సిద్ధి హనుమాన్ ఆలయంలో మహాశివరాత్రి జాతర ఉత్సవాలను భజరంగ్‌దళ్ జిల్లా కన్వీనర్ దూసరి శివగౌడ్ గురువారం ప్రారంభించారు. నాలుగు రోజుల పాటు ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆలయ కమిటీ చైర్మన్ ఎల్ములే దత్తు తెలిపారు. జాతరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు రౌతు యాదవ్ పటేల్, ఆలయ కమిటీ సభ్యులు నితేష్, మోరేశ్వర్, గణపతి, రవి, భరత్ తదితరులు పాల్గొన్నారు.

కంకలమ్మ ఆలయంలో ఉత్సవాలు

కౌటాల: మండలకేంద్రం సమీపంలోని గుట్టపై గల స్వయంభూ శ్రీ కేతేశ్వర స్వామి–కంకలమ్మదేవి దేవస్థానంలో మహాశివరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ సుల్వ కనకయ్య గురువారం తెలిపారు. ఈనెల 18, 19వ తేదీల్లో ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఆలయంలో పల్లకిసేవ, మహా రుద్రయాగం, సహస్ర బిల్వార్చన, గోధూళికా ముహూర్తాన కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. 19న మహాప్రసాద వితరణ ఉంటుందని పేర్కొన్నారు.

రేషన్ బియ్యం అక్రమాలపై విచారణ చేపట్టాలి

ఆసిఫాబాద్: జిల్లాకేంద్రంలోని పౌరసరఫరాల శాఖ మండల స్థాయి గిడ్డంగిలో ఇటీవల జరిగిన రూ.2 కోట్ల బియ్యం అక్రమాలపై విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కలెక్టర్ బొర్కడే హేమంత్ సహదేవ్‌రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఖాండ్రే విశాల్ మాట్లాడుతూ ఎంఎల్ఎస్ పాయింట్‌లో సుమారు 40 లారీల బియ్యం అక్రమాలు జరిగాయన్నారు. ఈ విషయమై డీఎస్‌వో, ఎమ్ఎల్ఎస్ పాయింట్ ఇన్‌చార్జిలను సస్పెండ్ చేసి చేతులు దులుపుకున్నారన్నారు. వీరితోపాటు ఈ కుంభకోణంపై పూర్తిస్థాయి విచారణ జరిపించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు ఈదులవాడ గణేశ్, నాయకులు దిగదత్తుల రాధిక, జయరాజ్, సందీప్, శ్రీకాంత్, రాజేశ్, అర్చన, బన్ని, శ్రీరామ్ ఉన్నారు.